# నోట్లో వేలు!

పెళ్లిచూపులంటేనే నాకు ఎలర్జీ! ఈ వంకతో ఆడపిల్లను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేదు. మావాళ్ల పోరు పడలేక నేను యస్సనాల్సివచ్చింది. ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్ అన్చెప్పి మమ్మీ డాడీతో పాటునేనూ బయల్దేరాను.

పెళ్లి చూపులకెళ్లటమంటే స్వీట్లు హాట్లు బోలెడన్ని పెడతారోయ్ ఆడపిల్ల వాళ్లు! అవన్నీ మెక్కేసిరావచ్చు ఎంచక్కా! ఛాన్స్ మిస్ చేసుకోకు... అంటూ కొలీగ్ ఫ్రెండ్స్‌నన్ను ఆటపట్టించారు.

'ఇదేం శోభనం రాత్రా అవన్నీ ఏర్పాటు చేసి అగరొత్తులు వెలిగించి అలంకరింటానికి?-' వెటకారంగ అన్నాను.

'నువ్వొట్టి భజగోవిందానికి... ఇలాంటి ఈవెంట్స్ తెలుగుసినిమాల్లో.. ధారావాహిక టి.వీ. సీరియల్స్‌లో చూపించటం కామనైంది. సినీమాలకంటే వెళ్లవు సరే... సీరియల్స్ కూడా ఫాలో కావా?-' ముక్తకంతం తో అన్నారు.

'నాకు అవంటేనే హేడేక్! ప్రజలను ఈ విధంగా ఎడ్యుకేట్ చేయటం అవసరమని నేననుకోలేను...'

'నువ్వంతా అదోటైపు! అందరు ఉత్తరం అంటే నువ్వు దక్షిణమంటావ్! సర్లే.... వెళ్లక వెళ్లక పెళ్లి చూపులకెడుతున్నావ్. అమ్మాయిని శల్యపరీక్ష చేసి బావుంటే యస్ అను కళ్లు మూసుకుని గంగిరెద్దులా తలూపకురోయ్...'

'ఎం.బి.ఏ. చేసి ఎనభైవేలు జీతం తీసుకునే నన్ను ఎగతాళి చేస్తూ... తాటాకులు కట్టటం ఏమిటర్రా?' వాళ్లకు బై చెప్పి కారు నడుపుకుంటూ ఇల్లు చేరుకునే సరికి మమ్మీడాడీలు రెడీ అయి నాకోసమే వెయిట్ చేస్తున్నట్టు గమనించి 'జస్ట్ ఫైవ్ మినిట్స్‌లో రెడీ అవుతాను' అని చెప్పి బాత్‌రూమ్‌లోకి దూరాను.

× × × × ×

పెళ్లిచూపులకే అట్టహాసంగ బ్యాండు మేళం పట్టించిన ఆడపిల్ల వారి వాలకం చూచి నేననివ్వెరపోయాను. చూశావ్రా వాళ్లలెవెలు...' చేత్తో నన్ను పొడిచి గర్వంగ మాట్లాడాడు డాడీ. అమ్మేమో వాళ్ల అరెంజ్ మెంట్లకు తెగమురుస్తోంది.

ఇంతగ్రాండ్‌గా ఏర్పాట్లన్నీ చేశారంటే పిల్ల తప్పక రూపసి అయివుంటుంది... చెవిలో వూదేడు డాడీ.. మమ్మీ మాటపలుకు లేకుండా వుండిపోయింది.

ఏది ఏమైనా అప్యాయత సంతరించుకున్న వాళ్ల పలకరింపులకు తన్మయత్వం చెందామనే చెప్పక తప్పదు.

పుల్లారెడ్డి స్వీట్ షాప్‌లా స్వీట్లు హాట్లు రెండు వరసల్లో అరెంజ్ చేసి వుండటంతో చూచి మిఠాయి దుకాణమే ఇక్కడికి తరలించారా అన్పించింది.

కరచాలనాలు.. పరిచయాలు ముగిసేక... 'మళ్లీ వర్షం వచ్చేస్తుంది... అమ్మాయిని తీసుకురండి..' డాడీ తొందర చేశాడు.

'మీకోసం ప్రేమతో ఇవన్నీ ఏర్పాటు చేసాం... కానీ మీరు ఏవీ ముట్టుకోలేదు'. పిల్ల తండ్రి తల్లి ముక్తకంఠంతో డ్యూయట్ పాడినట్టు మాట్లాడారు.

'మీ అమ్మాయి మాకు స్వీట్‌గా వుంటే చాలు... ఇహ... ఇవన్నీ దిగదుడుపే...' చమత్కరించాడు డాడీ.

'సరే... కావ్యను తీసుకురండి' పిల్ల తండ్రి భార్యతో అనటంతో ఆమె లోనికి వెళ్లింది.

మరో రెండు నిముషాల్లో కూతురిని వెంటపెట్టుకువచ్చి దూరంగా వున్న సింగిల్ సోఫాలో కూర్చోపెట్టి తల్లి వెనకగా నిలబడివుంది.

పిల్లకేంతక్కువ? చక్కదనాల చుక్క! అందాల భరిణ! అన్పించినా... ఆపిల్ల నోట్లో వేలేమిటి? డాడీ చెవిలో వూదాను.

'అలవాటేమోలేరా....' సర్ది చెప్పబోయాడు.

పెళ్లీడుకొచ్చినా ఇదేం అలవాటు అన్పించటంతో ఆముదం తాగినవాడిలా ముఖం పెట్టాను.

'అమ్మాయి దేవకన్యలా వుంది. ఎంత వరకు చదువుకుందీ...?-' ఏ పి.జి అయినా చేసి వుంటుందన్పించటంతో ఆత్రంగ ప్రశ్నించాడు మాధవరావు వురఫ్ పిల్లాడి తండ్రి

'టెన్త్ ఫెయిలైనానండీ...' నోట్లో వేలు తీసి జవాబిచ్చి మళ్లీ ఠక్కున వేలేసుకుంది కావ్య.

పిల్ల అందం నచ్చింది. రెండక్షరాల పేరు నచ్చింది. చదువులేక పోవటం నచ్చలేదు. సిగ్గులేకుండా బహిరంగంగా అందరి ఎదుట...అందునా పెళ్లి చూపుల సమయంలో నోట్లో బొటనవేలు వేసుకుని చీకటం అసల్సు నచ్చలేదు నాకు.

మమ్మీ డాడీలు ఒకరి ముఖాలు మరొకరు చూసుకుని... నవ్వుకుని...

నాప్రమేయం.... అంగీకారం అవసరం లేదనుకున్నారో ఏమో 'కావ్య మా అందరికీ నచ్చింది. తాంబూలాలు త్వరలో ఏర్పాటు చేసుకుందాం' సంబరపడిపోతూ డిక్లేర్ చేసేశారు.

'చాలా సంతోషంగా బావగారూ... కానీ ఒక్క విషయం చెప్పనందుకు మన్నించాలి! కావ్యకు చిన్నప్పటి నుండీ నోట్లో వేలు అలవాటు. దాన్ని మాత్రం వదులుకోలేకపోతోంది. అదొక్కటే లోటు...' కుండబద్దలు కొట్టాడు కావ్య తండ్రి.

'ఒక్కతే పిల్ల కదాని కాస్తంత గారాబం చేశాం! ఆగారాబంతోటే... కావ్య చేత నోట్లో వేలు మాన్పించలేకపోయాం' పిల్ల తల్లి వంతపాడింది.

'దానిదేముందండి... ఇలాంటి వన్నీ చిన్న విషయాలు.. అది చర్చనీయాంశం కాదు...' సమర్థించాడు మాధవరావు.

కావ్యకున్న నోట్లో వేలు అలవాటే నన్ను ఎంతో కొంత అసంతృప్తికి గురిచేయటంతో నోరు విప్పలేదు. నచ్చి(చ్చ)నట్లు సైగలూ చేయకుండా సైలెంట్‌గా వుండిపోయాను.

× × × × ×

శోభనం రాత్రి ఆడపిల్లవారింట్లో గదిని శోభాయమానంగ అలంకరింపబడివుండటం చూచి సినీమా సీన్‌ను తలపించింది. ఘుమ ఘుమలాడే సుగంధ పరిమళాల సువాసన మనసును మత్తెక్కిస్తున్న మధురక్షణాల్లో...

కుడిచేతి బొటనవేలు నోట్లో... ఎడమ చేత్తో పాలగ్లాసులో ఎంటరైన కావ్యను చూచి అవాక్కయ్యాను. చివరకు ఇది శోభనం గదిలో కూడా నోట్లో వేలేసుకునే వుంటుందా? ఇలా అయితే ముద్దు ముచ్చట మాటేమిటి? ఒక పక్క నవ్వు మరోవైపు కోపం నాలో తన్నుకొచ్చినయ్.

నేరుగా మంచం మీదున్న నన్ను చేరుకోని ఎడమ చేతిని ముందుకు చాచి పాలు తాగమన్నట్టు సంకేతమిచ్చింది.

'నేపాలు తాగుతాను సరే... మరి నీ సంగతేంటి? మిగిలిన సగంనువ్వు తాగవా?' నివ్వెరపోతూ అడిగాను.

నాకు అర్థం కాని సైగలేవో చేసింది. నాకెందుకు లెమ్మనుకుని దాని చేతిలో గ్లాసు లాక్కుని సగం తాగి తిరిగి గ్లాసు వెనక్కు ఇవ్వగానే నోట్లో వేలు తీసి ఒక్క గుక్కలో పాలు తాగేసి మళ్లీ నోటికి తాళం వేసింది.

ఇదెక్కడి గోలరా దేవుడా? ఇంత అందమైన ఆడపిల్లకు ఈ బలహీనతేంటో నాకు బోధపడక తల బద్దలుకోక తప్పలేదు.

'ఒసేవ్ అమ్మడూ... నా అందమైన పెళ్లామా నోట్లో వేలు ఇప్పుడెందుకే? నిద్రపోయే ముందు వేసుకోవచ్చేలే. ప్రస్తుతానికి నీ బొటనవేలుకి కాస్సేపు రెస్ట్ ఇవ్వు. చూడు.. చీకి చీకి నీవేలు ఎంత చిక్కిపోయిందో. ఇంకొన్నాళ్లూ ఇలాగే వేసుకుంటే ఆవేలు వూడిపోయే ప్రమాదముందే భార్యామణీ...' కౌగిట్లోకి తీసుకున్నాను.

కావ్య మాత్రం తన పట్టువీడలేదు. నోట్లో వేలు తియ్యనూ లేదు.

'అబ్బా నామాట విని ఆవేలు తియ్యవే..' చేతిని బలవంతాన లాగాను... స్ప్రింగ్ యాక్షన్ వున్నట్టు లటుక్కున బోటనవేలు నోట్లోకి దూరింది.

'మరిట్లాగైతే.. ముద్దెలా పెట్టుకుందామే...' అసహనం చోటు చేసుకుంది నాలో.

బుగ్గల మీద పెట్టుకుందాంమంటూ సైగలతో చెప్పేడ్చింది. నావళ్లు భగభగమండి నట్టయింది.

ఇదేం శోభనం రాత్రిరా భగవంతుడాని వాపోక తప్పలేదు.

'ఇలా అయితే... అంటే... నువ్వు అవిశ్రాంతంగ నోట్లోవేలుసుకుంటే భోజనం ఎలా చేస్తావ్? నేనేదైనా వూరెడితే నాతో మొబైల్లో ఎలా మాట్లాడతావ్?'- తిక్కతిక్కగా మాట్లాడేశాను. ఇన్నేళ్లోచ్చాక కూడా నోట్లో వేలేసుకోవటం ఛండాలంగాలేదూ?... సిగ్గన్పించటం లేదా? నువ్వేమైనా పసిపాపవా?'

నాప్రశ్నలకు జవాబివ్వకుండా స్వీట్స్ చేతిలోకి పుచ్రచేత్తో తీసుకుని దాన్ని నా నోట్లో పెట్టబోయింది.

'ఛీపాడు. మొగుడికి అందునా శోభనం రాత్రి ఆచేత్తో తిన్పిస్తావా...' చీదరించుకుని దూరంగా జరిగాను.

'మీకో విషయం చెప్పనా?- మీరెంత మొత్తుకున్నా ప్రయోజనం వుండదు. మావాళ్లు నోట్లోవేలు నా చేత మాన్పించాలని ఎన్నెన్నో ప్రయోగాలు చేసి చేసి విసిగి ఫుల్‌స్టాప్ పెట్టారు. నేనింతే! నన్నొదిలేయండి...'

'ఏవేం ప్రయత్నాలు చేశారో చెప్పు! నీ స్టోరీ ఏదో ఇంటరెస్టింగ్‌గా వుంది..'

'బొటనవేలికి రోజూ గోరింటాకు పెట్టారు. కొన్నాళ్లు మిర్చిపొడితో కట్టుకట్టారు. తర్వాత బ్యాండేజి కట్టుకట్టారు. వేలిమీద వాత పెట్టారు. ఇంకా చాలా రకాలుగా

హింసించారు. అయినా వేలు చీకటాన్ని వదలేదు. చిన్నప్పుడు తెగఏడుస్తున్నాని వేలు చీకటం అలవాటు చేశారు. వేలు చీకితే 'తేనె' నోట్లోకొస్తుందని కట్టు కథలు చెప్పారు. తర్వాత పెద్దయ్యాక వేలువసుకోవటం మాన్పించటం కోసం నన్ను నానా తిప్పలు పెట్టి పెట్టి కడకు విసిగి నావెంట పడటం మానుకుని నా ఇష్టానికొదిలేశారు. అదీ నాఫ్లాష్‌బ్యాక్ అఫ్ నోట్లో వేలు స్టోరీ!

ఎట్లాగో ఆరాత్రి నానా అవస్థలు పడి తెల్లవారిందన్పించాం!

× × × × ×

ఇరవై నాలుగు గంటలూ నోట్లో వేలేసుకుని ఇంట్లో తిరగటం చూస్తుంటే నాకు ఎలర్జీగా వుంది! టాలరేట్ చెయ్యలేకపోతున్నాను. బ్రతిమాలినా... కోప్పడినా... వేలు అలవాటు మానేట్టులేదు. నాపాలిట తలనొప్పిగా మారింది. నలుగురూ చూచి హేళన చేస్తారనే పెళ్లి అయ్యాక రిసెప్షన్ కూడా పెట్టలేదు..

భార్యతో ఎక్కడికైనా బైటికి వెళ్లాలంటేనే 'షేమ్' ఫీలవాల్సివస్తోంది. నా సరదాలు తీరటమే లేదనే అసంతృప్తి నన్ను వేధిస్తోంది. ఇలా ఎన్నాళ్లు? జీవితాంతమా? అమ్మో... నోనో!

ఈ విషయాన్ని పేరెంట్స్‌తో అనేక సార్లు చెప్పాను. వాళ్లీ విషయాన్ని సీరియస్‌గానే తీసుకోవటం లేదు. నాసరదా చచ్చిపోతోందని మొత్తుకున్నాను. అయినా సరే... ఓ నవ్వు నవ్వి వదిలేశారు. ఇక బాధ వేదన ఎవరికి చెప్పుకోను?

నోట్లో వేలు విషయంలోనే ఇద్దరికీలడాయి! వాదన!... ఎడముఖం... పెడముఖం!... అసంతృప్తి!

దీనికి ముగింపు పలకాలి! కానీ ఎట్లా? అది నోట్లో వేలేసుకున్నప్పుడల్లా బలవంతాన తీయాలని చాలా సార్లు ప్రయత్నించాను. సహనం కోల్పోయిందో ఏమో... ఒకసారి కళ్లు పెద్దవి చేసి నోట్లోవేలు తీసి నాపై చెయ్యెత్తింది.

నాకు వళ్లుమండింది! నన్ను కొట్టబోయిన భార్యను అసహ్యించుకునే స్థితికి దిగజారాల్సి వచ్చింది.

'చూడు కావ్యా! నువ్వు సహనాన్ని పరీక్షించవద్దు. మొండిగా ప్రవర్తిస్తే నీకు విడాకులిచ్చేస్తాను-' అల్టిమేటమిచ్చాను. అయినా లేశమంతైనా కావ్యలో మార్పురాలేదు. నా ప్రయత్నం వేస్ట్ అయినందుకు బాధపడ్డాను.

కారణం చెప్పకుండా కావ్యను పుట్టింటికి పంపించి పేరెంట్స్‌తో అబద్ధం

చెప్పాను.

పేరెంట్స్‌కి తెలీకుండా లాయర్ ద్వారా డైవోర్స్ నోటీసు కావ్యకు పంపాను.

× × × × ×

అంత త్వరగా విడాకులు కోర్టు ఇవ్వదని నాకూ తెల్సు! కానీ ఆఖరి ప్రయత్నం చేసేనైనా కావ్య నోట్లోవేలు మానేస్తుందోమోని ఆవగింజంత ఆశ.

ఆరోజు జడ్జి మమ్మల్నిద్దర్నీ కౌన్సిలింగ్ కోసం ఆయన పర్సనల్ ఛేంబర్లోకి పిలిచారు.

నేను చెప్పేదంతా విన్న న్యాయమూర్తి ఓ చిరునవ్వు నవ్వి 'వేళ్లు చీకటం అంటువ్యాధి కాదయ్యా! పోత పాలపిల్లలు ఆకలి తీరక ఏడుస్తుంటే తల్లులు పిల్లలకు నోట్లో వేలు అలవాటు చేస్తారు. వేళ్లు చీకే అలవాటు నూటికి యాభై శాతం పిల్లలకుంటుంది. కొందరు వూహతెలిశాకమానాారు. కొందరు వయసు మీరినా కంటిన్యూ చేస్తారు. ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా వినరు. తిట్టినా కొట్టినా... మాన్పించటానికి శతవిధాల ప్రయత్నం చేసి కన్నవారు విసిగిపోతారు. ఈ వేలు చీకే అలవాటు ప్రపంచమంతటా వుంది! ఇదేం అంటువ్యాధి కాదు.- నామటు నాకు కుడిచెయ్యి మూడు నాలుగు రెండు వేళ్లు కలిసి చీకే అలవాటు! నా రెండు వేళ్లూ చూడండి అరిగి అగ్గిపుల్లల్లా ఎలా తయారైనయ్యో.- ఇప్పటికీ పడుకునేటప్పుడు నోట్లో వేళ్లు వేసుకుంటే గానీ నిద్రపట్టదు! ఇంటి వద్ద పనేమీలేనప్పుడు.... కోర్టుకొచ్చాక లంచ్ అవర్లో కునుకు తీయబోయే ముందు వేళ్లు చీకుతూనే వుంటాను. లేకపోతే ఏదో అసంతృప్తి వెంటాడుతూంటుంది. అది వన్స్ ఓన్‌ఫీలింగ్! ఇలాంటి అలవాటుకులోనైన వారికి విడాకులు ఇవ్వచ్చని ఏ చట్టంలోనూ లేదు.- కాబట్టి నీ మైండ్ సెట్ మార్చుకుని నీ భార్యతో ఆనందంగా కాపురం చేసుకో... సుఖపడు!!-' అన్చెప్పిన న్యాయమూర్తి రెండువేళ్లూ నోట్లో వేసుకుని చీకుతూ ఓ'నేప్' తీయటం చూచి అవాక్కయ్యాను.

(సమాప్తం)